బీజేపీ పాలనలో నిరుద్యోగ సమస్య తీవ్రం

● భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మేళ్లచెర్వు : మేళ్లచెర్వులో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మేళ్లచెర్వు, ఏప్రిల్ 20 : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ పాలనలో దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా మారిందని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యావసర ధరలు పెంచి సామాన్యుడిపై పెను భారం మోపడమే కాకుండా, దేశంలో ప్రజాస్వామ్యాన్ని అణచివేస్తుందని దుయ్యబట్టారు. తెలంగాణకు రావాల్సిన ప్రాజెక్టులు, నిధులు సరిగ్గా ఇవ్వలేదన్నారు. పదేళ్ల పాటు తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిన బీజేపీకి ఓట్లు అడిగే అర్హత లేదన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

మఠంపల్లి/చింతలపాలెం: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పార్టీ ప్రతీ కార్యకర్త పని చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎన్‌ఎస్‌ఎల్ పరిశ్రమ ఆడిటోరియంలో జరిగిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో మాజీ మంత్రులు జానారెడ్డి, రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

● డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం

తిరుమలగిరి పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం

తిరుమలగిరి, ఏప్రిల్ 20 : ప్రజా ఆరోగ్యం పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కోటాచలం అన్నారు. శనివారం స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రతి గ్రామంలో ఓఆర్ఎస్ డిపోలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ దవాఖానల్లో సహజ ప్రసవాలు జరిగేలా చూడాలని పేర్కొన్నారు.

కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ సాహితి, డాక్టర్ పెండం వెంకటరమణ, డాక్టర్ గాజుల చంద్రశేఖర్, పీహెచ్‌సీ డాక్టర్ వందన, ఎస్ఓ వీరయ్య, ఎపిడమాలజిస్ట్ సతీశ్, డీపీఓ కిరణ్, సీహెచ్ఓ బిచ్చునాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాల నివారణకు కృషి చేయాలి

● సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాస్‌రావు

సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న సైబర్ సెక్యూరిటీ సెల్ డీఎస్పీ శ్రీనివాస్‌రావు

సూర్యాపేట సిటీ, ఏప్రిల్ 20 : ప్రస్తుత సమాజంలో సాంకేతికత పెరిగేకొద్ది అదేస్థాయిలో సైబర్ మోసాలు పెరుగుతున్నట్లు సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాస్‌రావు అన్నారు. ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో పోలీస్ సిబ్బందికి సైబర్ మోసాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాలకు బలమైన పాస్‌వర్డ్ పెట్టుకోవాలన్నారు. అలాగే మొబైల్‌లో యాప్స్‌ను డౌన్‌లోడ్ చేసే క్రమంలో ఫోన్ అనుమతులు ఇవ్వడం వల్ల సైబర్ మోసాలకు గురవుతామని తెలిపారు. కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్ఎస్ఐ అన్వర్, కళాబృందం సభ్యులు, అర్మ్డ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వాచ్యాతండాలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి

ఉపాధి హామీ పథకంలో ప్రతి కూలీకి పని కల్పించాలి

● ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి

దామరచర్ల, ఏప్రిల్ 20: జాబ్‌కార్డు కలిగి ఉన్న ప్రతి కూలీకి పని కల్పించాలని ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి సూచించారు. మండలంలోని వాచ్యాతండా, బాలాజీనగర్ గ్రామ పంచాయితీల్లోని చెరువుల్లో ఉపాధి హామీ పథకం కింద పూడిక తీసే పనులను ఆయన శనివారం పరిశీలించారు. రిజిస్టర్ల, హాజర్ రోల్‌కాల్‌ను పరిశీలించారు. కూలీలకు కొలతల ప్రకారం పనులు చేయడంలో, వేజ్‌రేట్ పెంచుకోవడంపై అవగాహన కల్పించాలన్నారు.వడదెబ్బ తగులకుండా తగిని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ నాగేశ్వర్‌రావు, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఓటు హక్కుతో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలి'

నార్కట్‌పల్లి , ఏప్రిల్ 20 : ఓటు హక్కుతో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు అన్నారు. స్థానిక కామినేని మెడికల్ కాలేజీ సెమినార్ హాల్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఓటర్లు బాధ్యతాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కామినేని దవాఖాన సూపరింటెండెంట్ కర్నల్ డాక్టర్ ఎడ్విన్ లూథర్, కన్నెబోయిన ఉషారాణి, ప్రిన్సిపల్ డాక్టర్ రంగారావు, కిరణ్, సందీప్, మెడికల్ కాలేజీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ శంకర్‌రెడ్డికి పరామర్శ

శాలిగౌరారం, ఏప్రిల్ 20 : మండలంలోని బైరవునిబండ గ్రామ ఎంపీటీసీ కొత్త శంకర్‌రెడ్డి తండ్రి నర్సిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఐతగోని వెంకన్నగౌడ్, చాడ హతీశ్‌రెడ్డి, కట్టా వెంకట్‌రెడ్డి, గుజిలాల్ శేఖర్‌బాబు, శాలిలింగోటం ఎంపీటీసీ పాక రాములు, బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు కల్లూరి నాగరాజుగౌడ్, రంజిత్ శనివారం శంకర్‌రెడ్డి స్వగ్రామం రామాంజపురం వెళ్లి నర్సిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిఘా పెంచాలి

● నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు కళ్యాణ్‌కుమార్ దాస్

సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు కళ్యాణ్‌కుమార్ దాస్

సూర్యాపేట, ఏప్రిల్ 20 : సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిఘా మరింత పెంచాలని నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు కళ్యాణ్‌కుమార్ దాస్ అన్నారు. రాష్ట్ర, జిల్లా సరిహద్దు చెక్ పోస్టుల్లో నియమించిన బృందాలు నిరంతరం నిఘా పెంచి ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని ఆయన సూచించారు. సూర్యాపేట కలక్టరేట్ సమావేశ మందిరంలో నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ, జీఎస్టీ, సహాయ వ్యయ పరిశీలకులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్ బి.ఎస్.లతతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వ్యయ పరిశీలన, ఖర్చుల పక్కగా ఉండాలని పేర్కొన్నారు. కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా 13-నల్లగొండ పార్లమెంట్ నియోజవర్గ పరిధిలో హుజూర్‌నగర్ సెగ్మెంట్‌లో 7మండలాలు, రెండు మున్సిపాలిటీలు, కోదాడ సెగ్మెంట్‌లో 6 మండలాలు, ఒక మున్సిపాలిటీ, సూర్యాపేట సెగ్మెంట్‌లో 4మండలాలు ఒక మున్సిపాలిటీ ఉన్నదని, మొత్తం 21 ఎంసీసీ బృందాలు పని చేస్తున్నట్లు తెలిపారు. మూడు అసెంబ్లీ సెగ్మెంట్లలో 875 పోలింగ్ కేంద్రాల పరిధిలో 7,39,757 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. సీ విజిల్‌తో దరఖాస్తులు 6 డ్రాప్ అవ్వగా 13 పరిష్కరించినట్లు తెలిపారు. అలాగే గ్రీవెన్స్ ద్వారా 179 కేసులకు గాను 157 ఇప్పటికే పరిష్కరించినట్లు, మిగిలిన 22 కేసులకు సంబంధిత బాధితులు ఆధారాలు చూపితే అందజేస్తామన్నారు. అలాగే ఐటీ పరిధిలో 2 కేసులు ఉన్నాయన్నారు. ఎస్పీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ.. వివిధ టీమ్స్ ద్వారా మూడు సెగ్మెంట్లలో రూ.4.60 కోట్ల స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, సోషల్ మీడియా ట్రాకింగ్ సెంటర్, డిజిటల్ బ్యాంకింగ్ ట్రాన్‌జాక్షన్స్ సెంటర్, ఎన్నికల ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్‌ను కళ్యాణ్‌కుమార్ దాస్ జిల్లా కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ సతీశ్‌కుమార్, సీతారాం అప్పారావు, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, ఎల్‌డీఎం బాపూజీ, ఎంసీసీ నోడల్ ఆఫీసర్ సతీశ్‌కుమార్, అసిస్టెంట్ ఎక్స్‌పెండేచర్ నోడల్ ఆఫీసర్ పద్మ, ఆర్‌డీఓ సూర్యనారాయణ, శ్రీనివాసులు, వేణుమాధవ్, తాసీల్దార్లు, బ్యాంక్ అధికారులు, పోస్టల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్

హుజూర్‌నగర్ : జరుగబోయే లోక్‌సభ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధం కావాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. శనివారం ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి పట్టణంలోని వేంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో హుజూర్‌నగర్ నియోజకవర్గం పరిధిలో ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద అసౌకర్యాలు లేకుండా చూసుకోవాలని సెక్టార్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ సరిగ్గా జరిగే విధంగా చూసుకోవాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎస్పీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల వేళ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సరిహద్దు చెక్ పోస్టుల వద్ద తనిఖీలను ముమ్మరం చేయాలన్నారు. అధికారులు ఎన్నికల నియమాళిని ఖచ్చితంగా అమలు చేయాలని పేర్కొన్నారు.

కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాసులు, సీఐ చరమందరాజు, జిల్లా ఎక్సైజ్ అధికారి లక్ష్మానాయక్, తాసీల్దార్లు నాగార్జునరెడ్డి, మంగ, కవిత, శ్రీదేవి, సంధ్య, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయమూర్తి అమరావతి బదిలీ

హుజూర్‌నగర్, ఏప్రిల్ 20 : హుజూర్‌నగర్ రెండో అదనపు జిల్లా ఇన్‌చార్జి న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్న సూర్యాపేట జిల్లా మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి అమరావతి బదిలీ అయ్యారు. హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టుకు బదిలీ చేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ తిరుమలాదేవి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె స్థానంలో భద్రాది కొత్తగూడెంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తిగా పనిచేస్తున్న శ్యామ్ శ్రీ సూర్యాపేట జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తిగా, హుజూర్‌నగర్ రెండో అదనపు జిల్లా ఇన్‌చార్జి న్యాయమూర్తిగా నియమిస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

మద్దిరాల, ఏప్రిల్ 20 : నేడు మండల కేంద్రంలో ఉదయం 6 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు స్వల్ప అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ పీఓ సురేందర్ శనివారం తెలిపారు. 11 కేవీ ఫీడర్ కింద చెట్ల కొమ్మల తొలగింపు, వీధి లైట్లు అమర్చడం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు కవిరాజ్ 56వ కవి సమ్మేళనం

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 20 : ఆదివారం సాయంత్రం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సుధాబ్యాంక్ ఆడిటోరియంలో కవిరాజ్ 56వ కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు మనమ్ వికాస్ వేదిక అధ్యక్షుడు పెద్దిరెడ్డి గణేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్ ముఖ్య అతిథిగా హాజరై కవిరాజ్ సాహితీ పురస్కారాన్ని ప్రముఖ కవి, వాగ్గేయకారుడు సిద్ధార్థకు అందజేయనున్నట్లు వెల్లడించారు. కవి సమ్మేళనంలో మంచి కవితలకు న్యాయవాది జె.శశిధర్ బహుమతి ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి కవులు, సాహితీ ప్రియులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేటి నుంచి పాలె అన్నారంలో కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

చిలుకూరు, ఏప్రిల్ 20 : మండల పరిధిలోని పాలెఅన్నారం గ్రామంలో నూతనంగా నిర్మించిన కనకదుర్గమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. ఈ 21న విగ్రహాల ఊరేగింపు, 22న విఘ్నేశ్వర పూజ, 23న జలాధివాసం, 24న ఉదయం కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు.

'గర్భిణులు తప్పకుండా టీకాలు తీసుకోవాలి'

నూతనకల్, ఏప్రిల్ 20 : గర్భిణులు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు తీసుకోవాలని వైద్య సిబ్బంది అన్నారు. మండలంలోని ఎర్రపహాడ్, పెదనెమిల, తాళ్లసింగారం, వెంకేపల్లి గ్రామాల్లోని సబ్ సెంటర్లలో శనివారం గర్భిణులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాల క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా టీకాలు వేసి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కోదండ రాముడి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

నేడు దేవతా మూర్తుల విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

దేవతామూర్తుల విగ్రహాలకు పంచామృతాభిషేకం చేస్తున్న భక్తులు

నేరేడుచర్ల, ఏప్రిల్ 20 : నేరేడుచర్ల పట్టణంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ నిర్మాణ కమిటీ పర్యవేక్షణలో రెండో రోజు శనివారం వేద పండితులు ఉదయం మండప పూజ, వేద స్వస్తి, మూలమంత్ర హోమాలు, మహాన్యవసం, మండప పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చొని హోమాల్లో పాల్గొన్నారు. దేవతా మూర్తులకు, మూల విరాట్‌లకు, ధ్వజస్తంభాలకు పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం ఆలయ మండపంలో స్వామి వారి విగ్రహాలను ఉంచి పుష్పాభిషేకం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆదివారం దేవతామూర్తుల ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రతిష్ఠాపన మహోత్సవం అనంతరం సుమారు 25 వేల మందికి అన్న వితరణ చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

కోదాడ వాసి నాగేశ్వర్‌రావుకు ఓయూ డాక్టరేట్

ప్రొఫెసర్ డాక్టర్ వి.బి. నరసింహ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను అందుకుంటున్న నాగేశ్వర్‌రావు

కోదాడ, ఏప్రిల్ 20 : కోదాడ పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన జిల్లపల్లి నాగేశ్వర్‌రావు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. నాగేశ్వర్‌రావు ఓయూలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఇన్ఫర్మేటిక్స్‌లో బీటెక్ పూర్తి చేశారు. ఓయూ ప్రొఫెసర్ డాక్టర్ వి.బి నరసింహ పర్యవేక్షణలో ఇంప్లిమెంటేషన్ ఆఫ్ డీప్ లెర్నింగ్ అండ్ కంప్రెషన్ టెక్నిక్స్ ఆన్ హెల్త్‌కేర్ సిస్టమ్ ఫర్ ఇంప్రూవ్డ్ డేటా స్టోరేజ్ ఎఫీసెన్సీ అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను ఆయన శనివారం డాక్టరేట్ పట్టా అందుకున్నారు.

ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ చేసిన పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

కోదాడ రూరల్, ఏప్రిల్ 20 : మండల పరిధి గుడిబండలో శనివారం వైద్య ఆరోగ్య శాఖ అందించిన ఓఆర్ఎస్ ప్యాకెట్లను కోదాడ పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాస్‌రెడ్డి ఉపాధి హామీ కూలీలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు ఎండ తీవ్రత పెరుగకముందే పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్మికులు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● మై హోం ప్లాంట్ హెడ్ శ్రీనివాస్‌రావు

మేళ్లచెర్వు, ఏప్రిల్ 20 : వేసవి నేపథ్యంలో అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మై హోం ప్లాంట్ హెడ్ శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం పరిశ్రమ ఆవరణలో అగ్నిమాపక వారోత్సవాల ముగింపు వేడుకలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాల నివారణ అవగాహనపై నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

కార్యక్రమంలో పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ ఉత్తమ్‌సింగ్, సీపీపీ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రావు, ఏజీఎం శ్రీనివాస్, సేఫ్టీ హెడ్ సూర్యనారాయణ, వేణునాయుడు, ఫైర్ ఆఫీసర్ లక్ష్మయ్య, సెక్యూరిటీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురుకులాల్లో సీట్లు

నేరేడుచర్ల, ఏప్రిల్ 20 : మండలంలోని పులగంబండతండాలోని ప్రభుత్వ పాఠశాలలో నాల్గొవ తరగతి చదువుతున్న ఆరుగురు విద్యార్థులు గురుకుల పాఠశాలలో సీటు సాధించినట్లు పాఠశాల హెచ్ఎం శ్రీధర్ శనివారం తెలిపారు. ఇటీవల 2024-25 విద్యా సంవత్సరానికి నిర్వహించిన 5వ తరగతి గురుకుల ప్రవేశ పరీక్షలో పాఠశాలలో చదువుతున్న నాల్గొవ తరగతికి చెందిన ఆరుగురు విద్యార్థులు గురుకుల పాఠశాలలో సీట్లు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను

భారీ మెజార్టీతో గెలిపించాలి

● మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

బొమ్మలరామారం, ఏప్రిల్ 20 : భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చీకటిమామిడి గ్రామంలో శనివారం నిర్వహించిన పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తుందని, ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నెలకో నినాదంతో ప్రజల ఆలోచనలను దారి మళ్లిస్తున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రైతు భరోసా, రూ.2లక్షల రుణమాఫీ, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని ప్రజలు అడుగుతున్నారని తెలిపారు. ప్రజలను ఏమార్చడం కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రభుత్వం వద్ద నిధులు లేవని చెప్పకుండా గత సర్కారు తప్పిదం వల్ల కొత్త పథకాలు అమలు చేయలేక పోతున్నామని చెప్పడం ఆయన చేతకానితనానికి నిదర్శనమని విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రతిపక్షంలో ఉన్నామని అధైర్యపడొద్దని, రాబోయే కాలంలో అంతా మంచే జరుగుతుందని భరోసా ఇచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సూదగాని హరిశంకర్‌గౌడ్, ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు పోలగాని వెంకటేశ్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ గూదె బాలనర్సయ్య, నాయకులు దామోదర్‌గౌడ్, శ్రీనివాస్, చంద్రమౌళి, మల్లారెడ్డి, బాల్‌సింగ్, బీరప్ప పాల్గొన్నారు.

భువనగిరిలో గులాబీ జెండా ఎగురడం ఖాయం

● మదర్ డెయిరీ డైరెక్టర్ రాంరెడ్డి

రాజాపేటలో మాట్లాడుతున్న మదర్‌డెయిరీ డైరెక్టర్ రాంరెడ్డి

రాజాపేట, ఏప్రిల్ 20 : బడుగు, బలహీన వర్గాల బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మదర్ డెయిరీ డైరెక్టర్ గొల్లపల్లి రాంరెడ్డి కోరారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సమస్యలపై ప్రశ్నించే గొంతుకను గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి ఖిలాపై గులాబీ జెండా ఎగురడం ఖాయమన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలు గడపగడపకూ ప్రచారం చేసి బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు గుంటి మధుసూదన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, యమ్మ భాస్కర్, బాలరాజు సురేశ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

● అదనపు కలెక్టర్ బీఎస్.లత

అర్వపల్లి : అర్వపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్.లత

అర్వపల్లి, ఏప్రిల్ 20 : ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ బీఎస్.లత అన్నారు. అర్వపల్లి ఐకేపీ కేంద్రాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సీరియల్ మెయింటెన్స్‌తో పాటు టాబ్ ఎంట్రీని వేగవంతం చేయాలని సూచించారు. అకాల వర్షాలు వస్తున్నందున సెంటర్ నిర్వాహకులు అప్రమత్తంగా ఉండి ధాన్యం కొనుగోళ్ల వెంట వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఎం వలిశెట్టి మల్లేశ్, సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు : ఆర్డీఓ

ఆత్మకూర్.ఎస్ : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని ఆర్డీఓ వేణుమాధవరావు, మండల ప్రత్యేక అధికారి నాగేశ్వర్‌శర్మ అన్నారు. మండల పరిధిలోని దాచారం, ఆత్మకూర్.ఎస్, నెమ్మికల్, ఏనుబాముల లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు తనిఖీ చేసి మాట్లాడారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ప్రతి రోజు మాయిశ్చర్ చూసి రికార్డుల్లో పొందుపరుచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ వినోద్‌కుమార్, ఏఓ దివ్య, ఏఈఓ శైలజ, శివకుమార్, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రకుమార్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

కాంటాలు త్వరగా పూర్తి చేయాలి

నాగారం : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు ఆలస్యం చేయొద్దని, వెంటనే పూర్తి చేయాలని తాసీల్దార్ బ్రహ్మయ్య అన్నారు. మండలంలోని పస్తాల, పసునూరు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలను పరిశీలించి మాట్లాడారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున సెంటర్లలో టార్పలిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కొనుగోలు చే